క్లుప్తంగా

నిరాడంబర జీవితమే రామతత్వం



ప్రవచనాలు చెబుతున్న రామ్మోహనరావు మాస్టారు

పొందూరు: శ్రీరామచంద్రుని ఆశయాలు సర్వకాలాలకు దిక్సూచిగా ఉంటాయని ఆధ్యాత్మిక వేత్త కె.రామ్మోహనరావు మాస్టారు అన్నారు. లైదాం శివానంద ధర్మక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సత్సంగంలో మాట్లాడారు. రామనామ స్మరణ కలియుగంలో మరింత అవసరమన్నారు. నీతిగా, నిరాడంబరంగా జీవించడమే రామతత్వమన్నారు. రామరాజ్యం రావడానికి పాలకులు, ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. శ్రీరాముని ఆశయాలును ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. అప్పుడే ధర్మం నాలుగు పాదాల మీద నడుస్తుందన్నారు. భారీ అన్నసమారాధన జరిగింది. సత్యసాయి ప్రతినిధులు ఎన్వీ రమణ, పెన్నం నానాజీ, పొందూరు, జీ.సిగడం, సంతకవిటి, ఎచ్చెర్ల, లావేరు మండలాల భక్తులు పాల్గొన్నారు.

నేడు గొర్రిబందలో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని గొర్రిబంద, జగ్గయ్యపేట, కోనవానిపేట, అగుతుపురం గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



మల్లేష్ భార్యకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న వలంటీర్

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన మల్లేష్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ గోక యమున ఆదివారం ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు.

లింగవివక్షతను నిర్మూలించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

సరుబుజ్జిలి: లింగ వివక్షత నిర్మాలనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రావివలస సర్పంచ్ వండాన కృష్ణ పిలుపునిచ్చారు. రావివలసలో లింగ వివక్షతకు వ్యతిరేకంగా ఆదివారం భారీ ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. వెలుగు ఏపీఎం కమలకుమారి పాండ్యన్, సీసీ కూన రోజాలత, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజారు వీధిలో చెత్త తొలగింపు



చేపల మార్కెట్ ఎదురుగా ఉన్న చెత్తను క్లీన్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మండల కేంద్రంలోని బజారు వీధిలో ఉన్న చెత్తను తొలగించడానికి పంచాయతీ సిబ్బంది ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కూరగాయలు, చేపల మార్కెట్‌తోపాటు బజారు వీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ బూరల్లి శంకర్, ఈఓ చిన్నారావు పర్యవేక్షించారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు

కొత్తూరు: తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్నందున రైతులు నష్టపోకుండా ఉండేందుకు ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ చక్రవర్తి, ఏఓ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కొత్తూరులో ఆదివారం మాట్లాడుతూ తుఫాన్ వల్ల ధాన్యం తడిచే ప్రమాదం ఉన్న రైతుల నుంచి ఆఫ్ లైన్ ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. వరి చేను నూర్పుడి చేసి ధాన్యం నిల్వ ఉంచుకోడానికి అవకాశం లేని రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అటువంటి రైతులు రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చి సంప్రదించాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది సూచన మేరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించడం జరుగుతుందన్నారు. మండలంలోని 18 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆఫ్ లైన్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తుఫాన్‌కు తడిచిపోతాయన్న అభద్రతాభావం ఉన్న రైతులు నుంచి మాత్రమే సిబ్బంది పరిశీలించి కొనుగోలు చేస్తారన్నారు.



ఆమదాలవలస రూరల్: రామచంద్రాపురం వద్ద పంట పొలాల్లో కుప్పలు పెడుతున్న రైతులు



నరసన్నపేట: గుండవల్లిపేట వద్ద వరి కుప్పల్లోకి నీరు వెళ్లకుండా తగిన చర్యలు చేపడుతున్న రైతులు



కొత్తూరు: వసప కాలనీలో ధాన్యం రాసిని టార్పాలిన్‌తో కప్పుతున్న మహిళా రైతులు



సారవకోట: గొర్రిబంద సమీపంలో ధాన్యం బస్తాలపై టార్పాలన్ కప్పిస్తున్న తహసీల్దార్ హనుమంతరావు

ఆందోళనలో అన్నదాత

మిచాంగ్ తుఫాన్ రైతులను కలవరపెడుతుంది. గ్రామాల్లో కోతలు కోసి పంట పనలపై ఉండగా, మరికొన్ని గ్రామాల్లో వరి కుప్పలు పెట్టడంతో ఏం చేయాలో తెలియక రైతులు కంగారు పడుతున్నారు. వర్షాలు అధికంగా కురిస్తే తిండి గింజలు కూడా దక్కవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వరి కుప్పలు పెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాల్లో దండోరా వేసి తుఫాన్‌పై అప్రమత్తం చేస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: అల్లాడలో వరి కుప్పలు పెడుతున్న రైతులు



నరసన్నపేట: గొట్టిపల్లి వద్ద కుప్పలు పెడుతున్న రైతులు, కూలీలు



కొత్తూరు: ఇటుక బట్టీపై టార్పాలిన్లతో కప్పిన తయారీదారులు



కొత్తూరు: వసప వద్ద కల్లంలో ఉన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో కప్పిన రైతులు

ఓటర్ల జాబితాల్లో తప్పులుంటే చర్యలు



ఎల్.ఎన్.పేట: ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న ఆర్‌ఓ వెంకట్రామన్



హిరమండలం: సుభలయ పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న ఆర్వో వెంకట్రామన్



నరసన్నపేట: మండల కేంద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింహాచలం

- పాతపట్నం నియోజకవర్గం ఎన్నికల అధికారి వెంకట్రామన్

ఎల్.ఎన్.పేట: ఓటర్ల జాబితాల్లో తప్పులుంటే బీఎల్‌ఓలపై చర్యలు తీసుకుంటామని పాతపట్నం నియోజకవర్గం ఎన్నికల అధికారి (ఆర్‌ఓ), జెడ్పీ సీఈఓ రావాడ వెంకట్రామన్ హెచ్చరించారు. మండలంలోని మల్లికార్జునపురం పోలింగ్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ల జాబితా నుంచి మృతి చెందిన, శాశ్వతంగా వలస వెళ్లిన, వివాహం జరిగి అత్తవారింటికి వెళ్లినవారి ఓట్లును విచారణ చేపట్టి కుటుంబ సభ్యులకు తెలియజేసి వారి అనుమతితో తొలగించాలన్నారు. అదేవిధంగా 2024 జనవరి నాటికి 18 ఏళ్లు వయసు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు కోసం రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన జాబితాలను ఒకటికి రెండుసార్లు విచారణ చేసిన తరువాత నిర్ణయం తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉప తహసీల్దార్ రషీద్ అహ్మద్ పాల్గొన్నారు.

సారవకోట: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ హనుమంతరావు ఆదివారం పరిశీలించారు. శని, ఆదివారాలలో ప్రత్యేక ఓటర్ నమోదును చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. బీఎల్‌ఓలు కొత్తగా ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు.



సారవకోట: వాండ్రాయిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతరావు

నరసన్నపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు చేపట్టారు. తహసీల్దార్ ఎ.సింహాచలం పలు కేంద్రాలకు వెళ్లి ఓట నమోదు ప్రక్రియపై ఆరా తీశారు.

హిరమండలం: పోలింగ్ కేంద్రాలకు వచ్చిన దరఖాస్తులను వెంటనే తీసుకుని పరిష్కరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకట్రామన్ సూచించారు. మండలంలోని పాత హిరమండలం, సుభలయలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆదివారం సందర్శించారు. ఓటర్ల నమోదు, తొలగింపులపై బీఎల్‌ఓలకు సూచనలు చేశారు. తహసీల్దార్ మురళీమోహన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

జలుమూరు: అర్హత ఉన్నవారందరికి ఓటు హక్కు కల్పిస్తామని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. మండల పరిధిలోని కరవంజ, గుగ్గిలి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించి ఆయా బీఎల్‌ఓలతో మాట్లాడారు.

పాతపట్నం: గ్రామస్థాయిలో నియమించిన బూత్ లెవల్ అధికారలంతా ఓటర్ల నమోదు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ కె.రవిచంద్ర సూచించారు. కాగువాడ, గోపాలపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. మండలంలోని 77 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను సంబంధిత బీఎల్‌వోల వద్ద ఉంచామన్నారు. ఓటు ఉన్నది, లేనిది సరి చూసుకోవాలన్నారు. ఎలక్షన్ డీటీ శైలజ, ఆర్ఐ భూవన్‌కుమార్, వీఆర్వో ఎం.వేణు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కొత్తూరు: పక్కా ఆధారాలు ఉన్నప్పుడే ఓటర్లును తొలగించాలని జెడ్పీ సీఈఓ వెంకట్రామన్ ఆదేశించారు. మండలంలోని వసప, నివగాం, మెట్టూరు, కురిగాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. తహసీల్దార్ చక్రవర్తి, ఆర్ఐ గిరిష్ కుమార్ పాల్గొన్నారు.



జలుమూరు: కరవంజలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తోస్తున్న తహసీల్దార్ సత్యం



పాతపట్నం: కాగువాడలో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిచంద్ర



కొత్తూరు: వసపలో బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న ఆర్వో వెంకట్రామన్

లక్షదీపారాధన



చిన్నారుల నృత్య ప్రదర్శన



అంజనేయ స్వామి ఆలయంలో లక్షదీపారాధన

కొత్తూరు: మండల కేంద్రంలోని పంచముఖి ఆంజనేయ ఆలయం వద్ద ఆదివారం రాత్రి లక్షదీపారాధన చేపట్టారు. ఆలయ నిర్మాణకర్తలు బరాటం గోవిందరావు, వైశ్యరాజు నారాయణరాజు శ్రీధర్, మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలగించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం చిన్నారులు చేసిన భరతనాట్యం చూపరులను ఆకట్టుకుంది. కొత్తూరు, పారాపురం, ఎస్ఎస్‌కాలనీ, మహసింగి, కర్లెమ్మ తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



ఓం ఆకారంలో వెలిగించిన దీపాలు

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామానికి చెందిన అంధవరపు చంద్రబాయ్ అనారోగ్యంతో బాధపడుతూ మోకాలకు శాస్త్ర చికిత్స చేయించుకున్నారు. చంద్రబాయ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.65 వేలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పాతపట్నంలోని తన కార్యాలయంలో అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, కర్రి లక్ష్మీనారాయణ ఉన్నారు.



చంద్రబాయ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఉత్సాహంగా భగవద్గీత కంఠస్థ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని నారాయణ తిరుమలలో ఆదివారం భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నగరంతో పాటుగా పలు దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 6, 7 తరగతుల విభాగంలో ప్రథమ స్థానాన్ని బాలభాను స్కూల్‌కు చెందిన ఎ.అమల, ద్వితీయ స్థానాన్ని పొన్నాడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన రేష్మ, మూడో స్థానాన్ని ఎంజేపీ స్కూల్‌కు చెందిన ఆర్.రశ్మిత దక్కించుకున్నారు. అలాగే 8, 9 తరగతులు విభాగంలో మొదటి మూడు స్థానాల్లో పి.జ్యోత్స్న (సాయి విద్యామందిర్), బి.లహరి (ఎంజేపీ స్కూల్), బి.మౌనిక (జెడ్పీహెచ్ స్కూల్, పొన్నాడ) గెలుపొందారు. 18 ఏళ్ల విభాగంలో మొదటి మూడు స్థానాలను పి.నివేద్ (సాయి విద్యామందిర్), ఎ.కృష్ణ శ్యామల (బాలభాను), వై.రిత్విక్ (సాందీపని) నిలిచారు. న్యాయనిర్ణేతలుగా బి.వేంకటలక్ష్మి, జంధ్యాల శరత్‌బాబు, కె.శ్యామసుందర్, సీహెచ్.రాధాకృష్ణ, కె.కృష్ణమూర్తి, జి.దేవరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, ధర్మప్రచారపరిషత్తు ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.లలితామణి, సీహెచ్ ప్రసాదరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్మయమిషన్ ఆధ్వర్యంలో..

చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో కూడా నారాయణ తిరుమలలో భగవద్గీత జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఏ-విభాగంలో ఆర్.శ్రావ్య (కలామ్స్ బ్లోసమ్ స్కూలు), ఎస్.రేణుక (అమర్‌కౌముది స్కూల్), ఎ.గీతాన్విత (శ్రీవేద) నిలిచారు. బి-విభాగంలో పి.సహస్ర (విద్యాభారతి గురుకులం), బి.రోహన్ (ఇన్‌స్పైర్ స్కూల్), పి.తనూజ (శ్రీవేద), సీ-విభాగంలో ఎస్.నందిత (శార్వాణి స్కూల్), దీక్షశ్రీ (ఇన్‌స్పైర్‌స్కూల్), సీహెచ్.మధు మేఘన (శ్రీవేద), డీ-విభాగంలో టీఎస్ఏ షణ్ముఖ శ్రీనివాస్ (గురజాడ గాయత్రి), ఎం.మాధవ మహేష్ (ఆక్స్‌ఫర్డ్ స్కూల్), పి.మౌనిక (మెహెర్ విద్యాలయం), ఈ-విభాగంలో డబ్ల్యూవీఎస్ మౌనిక(శార్వాణి), కె.సూర్య సుప్రజ (గురజాడ గాయత్రి), కె.శ్రీషిక శ్రీనిధిరాజ్ (గురజాడ గాయత్రి) నిలిచారు. కార్యక్రమంలో చిన్మయమిషన్ ప్రతినిధి స్వామి పరాత్మానంది సరస్వతి, స్వామి కృష్ణాత్మానంద సరస్వతి (తమిళనాడు), స్వామిసేవానంద సరస్వతి (విశాఖ), విశ్రాంత జడ్జి పప్పల జగన్నాథం, ఎస్.నరసింహమూర్తి, నారాయణ తిరుమల ఈవో శ్యామలరావు, శ్రీనివాస్‌శర్మ, సరుబుజ్జిలి ఎస్సై కృష్ణప్రసాద్, ఇన్‌స్పైర్ స్కూల్ డైరెక్టర్ అనంతరావు, యోగా గురువు తంగి స్వాతి, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్మయమిషన్ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

శ్రీముఖలింగంలో ట్రాఫిక్ జామ్



శ్రీముఖలింగంలో కిక్కిరిసిన వాహనాలు

జలుమూరు: శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. వాహనాలు సోమేశ్వర ఆలయం, హిరమండలం వైపు గ్రామ సమీప పొలంలో నిలుపుదల చేస్తారు. వాహనాలు లోపలికి విడిచిపెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భక్తులు నడిచి వెళ్లడాని సైతం అవకాశం లేదు. స్థానిక పోలీస్‌లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

భక్తుల సందడి..

మధుకేశ్వరుడిని దర్శించుకునేందుకు కార్తీక మాసం మూడో ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతోపాటు విశాఖ, విజయనగరం, ఒడిశా, చత్తీష్‌ఘడ్, తెలంగాణ నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చిన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



ఎడ్ల దాలయ్య (ఫైల్)

పాతపట్నం: మండలంలోని బద్దుమర్రి గ్రామానికి చెందిన వృద్ధుడు ఎడ్ల దాలయ్య శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దాలయ్య ఈ నెల 2వ తేదీన మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య బసంతి మందలించింది. దాలయ్య మనస్తాపం చెంది ఇంటిలో ఉన్న గడ్డిమందు తాగారు. వెంటనే వాంతులు రావడంతో విషయం తెలుసుకున్న భార్య గ్రామస్తుల సహాయంతో ఆటోలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భార్య తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు.

ఘంటసాలకు ఘన నివాళి



విద్యార్థులకు సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందజేస్తున్న సాహితివేదిక సంస్థ సభ్యులు

పాతపట్నం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో కిరణ్మయి సంస్కృతి సంస్థ, సాహితి వేదిక ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి తూలుగు తిరుపతిరావు, పతివాడ దాసునాయుడు, బందన శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఘంటసాల పాడిన పాటలపై పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు, షీల్డులు, బహుమతులు అందజేశారు. సలాన చిరంజీవి, కె.చత్రపతి, కాళ్ల రాజు, ఎస్.మధుబాబు, ఎం.రమణ, పి.చంద్రభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం



పేర్రాజును సత్కరిస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రయిచతల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 87వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో 14 మంది కవులు సమాజహిత కవితలు చదివారు. అనంతరం ప్రముఖ రచయిత, కవి, ఉపాధ్యాయుడు కాశీపట్నం పేర్రాజును సత్కరించారు. సమ్మేళనంలో కవులు బి.మోహన్‌గాంధీ, కిమ్మి సంతోష్ కుమార్, ఐఎన్‌డీ ప్రసాద్, డాక్టర్ పి.ఉపేంద్రశర్మ, డి.చిరంజీవి, వి.రాజారావు, ఐ.పాపయ్య, ఎం.శ్రీనివాసరావు, నిక్కు అప్పన్న, లలితారెడ్డి, తంగి ఎర్రమ్మ ఉన్నారు.